ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కర్ణాటక వార్తలు

మంగళవారం 24 సెప్టెంబరు 2024

26నుంచి 'సర్ఫేస్' ఎక్స్‌పో

బెంగళూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): లఘు ఉద్యోగభారతి పేరిట ఈనెల 26నుంచి సర్ఫేస్ ఎక్స్‌పో ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర కార్మిక, ఉద్యోగమంత్రిత్వశాఖ మంత్రి శోభాకరం ద్లాజె ప్రారంభిస్తారన్నారు. ప్యాలెస్ మైదానంలోని గ్రాండ్ కాస్లెలో జరిగే ప్రదర్శనలో చికిత్స రసాయనాలు, పౌడర్ కోటింగ్, పెయింటింగ్‌తోపాటు సాంకేతిక రంగానికి అనుబంధమైన వాహన రంగం, వైమానిక, ఎలక్ట్రానిక్స్ నిర్మాణరంగం, ఎలక్ట్రానిక్స్ విభాగాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. పారిశ్రామిక వేత్తలకు తమ ఉత్పత్తుల ప్రదర్శనకు ఇదో ఉత్తమ వేదిక కానుందని అన్నారు.



సిద్ధూ భవితవ్యం తేలేది నేడే..!

● 'ముడా' కేసులో నేడు ధర్మాసనం తీర్పు ● ప్రతికూలమైతే..మార్పులు తప్పవా..?

● పార్టీలో మద్దతుగా నిలిచేది ఎందరో..? ● అందరిచూపు హైకోర్టు వైపే..

బెంగళూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు మరోసారి టెన్షన్ మొదలయ్యింది. ముడా ఇంటి స్థలాల వివాదంలో సీఎం సిద్దరామయ్య భవిష్యత్తుపై కీలక తీర్పు మంగళవారం వెలువడనుంది. మధ్యాహ్నం 12 గంటలకు ముడా వివాదానికి సంబంధించి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగప్రసన్న ధర్మాసనం తీర్పును ప్రకటించనుంది. దీంతో సీఎం సిద్దరామయ్య భవిష్యత్తు తేలనుంది.! మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) ఇంటి స్థలాలను సీఎం సిద్దరామయ్య భార్య పార్వతి పేరిట 14 కేటాయించడంలో అవినీతి జరిగిందని రాజ్‌భవన్‌కు మూడు ఫిర్యాదులు అందాయి. దీంతో గవర్నర్, సీఎంపై ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇచ్చారు. దీన్ని సవాల్ చేస్తూ సీఎం సిద్దరామయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణలు, వాయిదాల ప్రక్రియ సాగి దాదాపు నెలన్నర కొనసాగింది. సీఎం సిద్దరామయ్య తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వి, కపిల్ సిబల్‌లు కీలకంగా వ్యవహరించగా ప్రొఫెసర్ రవివర్మ కుమార్ కూడా వాదించారు. గవర్నర్‌తోపాటు ముగ్గురు పిటిషనర్ల తరపున ముగ్గురు న్యాయవాదులు వాదనలు వినిపించారు. సమగ్ర విచారణ వారం కిందటే ముగిసింది. తీర్పును రిజర్వులో పెట్టిన ధర్మాసనం మంగళవారం తుది తీర్పు వెల్లడించనుంది. సీఎంకు అనుకూలంగా తీర్పు ఉంటే ప్రభుత్వంలోగానీ, రాష్ట్ర రాజకీయాల్లోగానీ ఎటువంటి మార్పు ఉండదు. ఒకవేళ సీఎంను ప్రాసిక్యూషన్‌ను ఎందుకు చేయరాదని ధర్మాసనం తీర్పు ఇస్తే రాష్ట్ర రాజకీయాలు అల్లకల్లోలం కానున్నాయి. విచారణ ఎదుర్కొనే పరిస్థితి వస్తే ముఖ్యమంత్రి పదవికి సిద్దరామయ్య రాజీనామా చేయాల్సిన అవసరం రావచ్చు. దీంతో హైకోర్టు తీర్పు ఏ విధంగా ఉంటుందనేది కీలకమవుతోంది. తీర్పు అనుకూలమైతే దాదాపు నెలరోజులుగా కుంగిపోయినట్లుగా మారిన సిద్దరామయ్యకు ఏనుగంత బలం చేకూరనుంది. ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇచ్చిన గవర్నర్‌కు కాస్త దెబ్బ తగిలినట్లేనని భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నైతికశక్తి రానుంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ వర్గాలలో ఆత్మవిశ్వాసం పెంపొందనుంది. రాజకీయంగా సిద్దరామయ్య మరింత శక్తివంతం కానున్నారు. సీఎం, ప్రభుత్వంపై పోరాటం చేస్తున్న బీజేపీకి దెబ్బకొట్టేందుకు అవకాశాలు ఇచ్చినట్లు అవుతుంది. దేశవ్యాప్తంగా బీజేపీ, కాంగ్రెస్‌లకు తీర్పుద్వారా ఎటువంటి సందేశం అందనుందో అనేది కీలకం కానుంది. గవర్నర్ ఆదేశాలను హైకోర్టు సమర్థిస్తే విచారణ అనివార్యం కానున్నాయి. విచారణ ఆదేశాలు వెలువడితే రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఒకవేళ రాజీనామా ఇవ్వకుండానే న్యాయపోరాటం చేసే అవకాశం ఉంది. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం, రాష్ట్రంలోని సహచర మంత్రులు, ఇతర నాయకులు తీర్పు తర్వాత ఎంత మేర మద్దతు ఇస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. హైకోర్టు ఆదేశాలను ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసుకోవచ్చు. గవర్నర్‌కు వ్యతిరేకంగా న్యాయపోరాటం, రాజకీయ సమరం ప్రారంభమైనట్లు అవుతుంది. రాష్ట్ర కాంగ్రెస్ ద్వారా మరోసారి రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలకు పిలుపు ఇచ్చే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో ప్రస్తావించి బీజేపీపై పోరాటం చేయవచ్చు.



వక్క రైతుకు విదేశీ దెబ్బ..!



● దేశంలో అత్యధిక సాగు.. రాష్ట్రంలోనే

● విదేశాల నుంచి దిగుమతికి అనుమతి

● అక్రమ రవాణాకూ అంతే లేదు

● దేశీయ రైతు నష్టాలపాలు

బెంగళూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యధికంగా రాష్ట్రంలోనే వక్క పంట సాగు చేస్తారు. పశ్చిమ కనుమలకు అనుబంధమైన పలు జిల్లాలతో పాటు తుమకూరు, చిత్రదుర్గ, రామనగర జిల్లాల్లోనూ వక్క సాగు అధికం. అయితే ఇటీవల విదేశాలనుంచి నాసిరకమైన వక్క దిగుమతి చేసుకోవడం, నాణ్యత పాటించకపోవడంతో మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. కేంద్రప్రభుత్వం విదేశాలనుంచి వక్క దిగుమతికి అనుమతులు ఇవ్వడం రైతులకు ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర ప్రభుత్వం భూటాన్ నుంచి 2022 నుంచి ఏటా సెప్టెంబరులో 17వేల మెట్రిక్ టన్నుల పచ్చి వక్కను దిగుమతి చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. విదేశీ వక్కను దిగుమతి చేసుకునేందుకు కేజీకి కనీస మద్దతు సుంకం రూ.351 గా ఉంది. అయితే భూటాన్ నుంచి దిగుమతి చేసుకునే వక్కకు సుంకం నుంచి మినహాయింపు ఇచ్చారు. మనదేశానికి భూటాన్ నుంచి మాత్రమే వక్కను దిగుమతి చేసుకోవడం లేదు. శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్‌ల నుంచి కూడా విరివిగా దిగుమతి అవుతోంది. మధ్యఈశాన్య సరిహద్దు దేశాలనుంచి భారీ స్థాయిలో అక్రమంగా వక్క దేశంలోకి రవాణా అవుతోంది.

● దేశంలో ఏటా 16-17 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అవుతుంది. అంటే ప్రపంచంలో 55శాతం వక్క మనదేశంలోనే పండిస్తారు. బంగ్లా, మయన్మార్, శ్రీలంక దేశాల్లో ఉత్పత్తి 25శాతం కూడా ఉండదు. అయినా ఏటా విదేశాలనుంచి వక్క దిగుమతి చేసుకోవడం ఆశ్చర్యం. రాష్ట్రంలో వక్క అత్యధికంగా పండించడమే కాకుండా ఎగుమతి చేయడంలోనూ పేరొందింది. మనదేశం దిగుమతిలోనూ తొలిస్థానంలో ఉంది. ఆ తర్వాత వియత్నాం, అమెరికాలు ఉన్నాయి. యూఏఈ, సింగపూర్‌లనుంచి కూడా వక్క దిగుమతికి కేంద్రం అంగీకరించింది.

అక్రమ రవాణాకు అంతేలేదు

● ఈశాన్య రాష్ట్రాల ద్వారా అక్రమ మార్గంలో వక్క దిగుమతి అవుతోంది. దశాబ్దాల కాలంగా ఈ ప్రక్రియ నియంత్రణ లేకుండా సాగుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల్లో 84 కేసులు నమోదు చేసుకోగా 3009 టన్నుల వక్కను స్వాధీనం చేసుకున్నారు. రోడ్డు మార్గంగానే వక్క దేశంలోకి వస్తోంది. ఎటువంటి రికార్డులు లేకుండా సరుకు రవాణా అసాధ్యం. అయినా భారీ స్థాయిలో ఎలా మార్కెట్‌లోకి వస్తుందనేది అంతుచిక్కని విషయంగా మారింది. ఈ ఏడాది మూడు కేసుల ద్వారా 10వేల కేజీల అక్రమ వక్కను స్వాధీనం చేసుకున్నారు.

● 2022-23 ఆర్థిక సంవత్సరంలో 258.19 డాలర్ల విలువైన 73,983 టన్నులు, 2023-24లో ఏప్రిల్ నుంచి నవంబరు వరకు 118.45 డాలర్ల విలువైన 30,271 టన్నుల వక్క దిగుమతి అయ్యింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 200 కోట్ల విలువైన 30వేల టన్నులకుపైగా వక్క దిగుమతి అయినట్లు కేంద్ర వాణిజ్యపన్నుల మంత్రిత్వశాఖ ప్రకటించింది. దేశంలో వక్క సంప్రదాయమైన పంటగా ఉంది. ఇండోనేషియా, మయన్మార్, మలేషియా తదితర దేశాల్లో అటవీ ప్రాంతాల్లో ఉత్పత్తి అవుతుంది. ఇటీవలి కాలంలోనే ఆ దేశాలలో కూడా సంప్రదాయంగా సాగుచేసేందుకు సిద్ధమయ్యారు. దేశంలో వక్క 50 శాతం కంటే తక్కువధరకు విదేశీవక్కలు లభిస్తున్నాయి. తక్కువధరకు లభించే వక్కలను దిగుమతి చేసుకుని మనదేశంలో ఉత్పత్తి అయ్యే నాణ్యమైన వక్కను మిశ్రమం చేసి వ్యాపారాలు చేస్తున్నారు.

వక్క రైతుకు షాకిచ్చిన కేంద్రం

దేశంలో ఉత్పత్తి అయ్యే నాణ్యమైన వక్కకు విదేశాల నుంచి దిగుమతి అయ్యే నాసిరకంతో మిశ్రమం చేసి విక్రయాలు జరుపుతున్నారని వక్కరైతులు ఆందోళన చెందుతున్నారు. తాజాగా కేంద్రం మరో షాక్ ఇచ్చింది. భూటాన్ నుంచి పచ్చివక్కను దిగుమతి చేసుకునేందుకు ఎటువంటి నిబంధనలు లేకుండా అవకాశం ఇచ్చింది. తద్వారా వక్క ధర భారీగా తగ్గిపోయే అవకాశం ఉంది. ఒడిశ్శాలోని హతీసర్, అస్సోం లోని దర్రంగ దల ద్వారా దిగుమతి చేసుకునేలా విదేశీ వ్యాపార వ్యవహారాల డైరెక్టరేట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2022 సెప్టెంబరు నుంచి కనీస దిగుమతి ధర (ఎంఐపీ) లేకుండా భూటాన్ నుంచి 17వేల టన్నుల పచ్చివక్కను దిగుమతి చేసుకున్నారు. 2017లో కేంద్రప్రభుత్వం దేశీయ వక్క సాగు చేసే రైతులకు అండగా ఉండేలా కేజీకి రూ.251 గా నిర్ణయించారు. 2018లోనూ ఇదే విధానం కొనసాగింది. తాజాగా భూటాన్ నుంచి అనుమతులు లేకుండా భారీస్థాయిలో దిగుమతి అవడం రాష్ట్రంలోని వక్కరైతులకు భారీగా నష్టం మిగల్చనుంది. రాష్ట్రంలో శివమొగ్గ, ఉత్తరకన్నడ, దక్షిణకన్నడలో వక్క మార్కెట్ జోరుగా సాగుతోంది.



విరగ్గాసిన వక్క పంట

ఉప ఎన్నికలకు కమలం కసరత్తు..!

● మూడు అసెంబ్లీ, రెండు ఎమ్మెల్సీ స్థానాలకు సిద్ధమవుతున్న జాబితా ● పోటీలో వారసులు



బెంగళూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు శాసనసభ స్థానాలకు జరిగే ఉప ఎన్నికల అభ్యర్థులకోసం బీజేపీ కసరత్తు మొదలయ్యింది. జాబితాను సిద్ధం చేసిన రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలు అధిష్ఠానానికి పంపేందుకు సిద్ధమయ్యారు. చన్నపట్టణ ఎమ్మెల్యే స్థానానికి కుమారస్వామి రాజీనామా చేసి ప్రస్తుతం కేంద్రమంత్రిగా ఉన్నారు. శిగ్గావి నుంచి గెలుపొందిన బసవరాజ్ బొమ్మై హావేరి ఎంపీ అయ్యారు. బళ్ళారి జిల్లా సండూరు నుంచి గెలుపొందిన తుకారాం బళ్ళారి ఎంపీ అయిన సంగతి తెలిసిందే. దీంతో ఆ మూడు స్థానాల్లో ఉప ఎన్నిక అనివార్యమయ్యింది. మూడు స్థానాలకు బీజేపీ అభ్యర్థుల విషయమై కోర్ కమిటీలో ఒక నిర్ణయానికి వచ్చారు. దీంతోపాటు ఉడుపి, దక్షిణకన్నడ జిల్లాల స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానానికి నోటిఫికేషన్ వెలువడ్డంతో చర్చ జరిగింది. ప్రతి నియోజకవర్గానికి ముగ్గురి పేర్లను పరిశీలించారు. అయితే చన్నపట్టణకు బీజేపీ నుంచి సీపీ యోగేశ్వర్ పేరు ప్రస్తావించారు. అయితే జేడీఎస్‌తో పొత్తు ఉండడం, ఈ స్థానం నుంచి కుమారస్వామి ప్రాతినిధ్యం వహించిన తరుణంలో ఆయనతో చర్చించి ఖరారు చేయనున్నారు. ఇక సండూరు స్థానానికి పార్టీ సీనియర్ నేత శ్రీరాములు పేరు ప్రస్తావనకు వచ్చినా ఆయన పోటీ చేసేందుకు వెనుకడుగు వేశా రు. జనార్ధనరెడ్డి అప్తుడు కే దివాకర్, మాజీ ఎంపీ దేవేంద్రప్ప కుమారుడు అణ్ణప్పలు రేసులో ఉన్నారు. శిగ్గావి విషయంలో బసవరాజ్ బొమ్మై కుమారుడు భరత్ బొమ్మైకు టిక్కెట్ దక్కించుకునే ప్రయత్నం సాగుతోందనేది తెలిసిందే. కానీ అధిష్ఠానం వారసత్వానికి ప్రాధాన్యం ఇస్తుందా అనేది పరిశీలించాల్సి ఉంటుంది. సాధ్యం కాకుంటే భరత్‌ను కాదంటే మాజీ మంత్రి మురుగేశ్ నిరాణి అభ్యర్థి అయ్యే అవకాశం ఉంది. ఉడుపి, దక్షిణకన్నడ జిల్లా స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ స్థానానికి మాజీ ఎంపీ నళిన్‌కుమార్ కటీల్, మాజీ మంత్రి ప్రమోద్ మధ్వరాజ్, మాజీ ఎమ్మెల్యే సంజీవ్ మఠందూర్‌ల పేర్లు వినిపిస్తున్నాయి.



విలీన గ్రామాలకు విజయదశమి కానుక

● దసరాకు బీబీఎంపీ పరిధిలోని 110 గ్రామాలకు కావేరి తాగునీరు

● రూ.5వేల కోట్ల ఖర్చుతో అరకోటి మందికి నీటి సౌకర్యం ● ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్



హారోహళ్ళి పంప్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీసీఎం డీకే శివకుమార్

బెంగళూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు పాలికె పరిధిలో కొత్తగా విలీనమైన 110 గ్రామాల ప్రజలకు విజయదశమికి కావేరి నీరు సరఫరా చేస్తామని డీసీఎం డీకే శివకుమార్ వెల్లడించారు. రామనగర జిల్లా హారోహళ్ళి పంప్‌స్టేషన్ వద్ద సోమవారం ఆయన పనులు పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన ఇకపై బెంగళూరు ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూస్తామని, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే విధానానికి స్వస్తి పలుకుతామన్నారు. ప్రాజెక్టుకు అన్ని అడ్డంకులు తొలగించామన్నారు. రానున్న పదేళ్లపాటు బెంగళూరుకు తాగునీటికి ఢోకా లేదన్నారు. ప్రస్తుతం 1400 ఎంఎల్‌డీల నీరు సరఫరా అవుతోందని ఇందుకు 775 ఎంఎల్‌డీలను చేరుస్తున్నామన్నారు. కెంగేరితోపాటు పలు ప్రాంతాల్లో అటవీభూమి ఉన్నందున పనులకు జాప్యం జరిగిందన్నారు. కావేరి ఐదోవిడత పనుల ద్వారా 4లక్షల కొత్త కనెక్షన్‌లు ఇస్తామని, రూ.5వేల కోట్లు ఖర్చు చేశామని కనీసం అరకోటి మందికి నీరు సమకూరనుందన్నారు. జైకా సంస్థ రుణసాయం అందించిందన్నారు. ఆర్‌ఆర్‌నగర్, బెంగళూరు దక్షిణ, కెంగేరి, ఆనేకల్, యశ్వంతపుర, బ్యాటరాయనపుర, బొమ్మనహళ్ళి, మహదేవపురలోని కొన్ని ప్రాంతాలకు నీరు అందిస్తామన్నారు. నగరంలో నీటి ఎద్దడిని నివారించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు.




నూతన అంబులెన్స్‌లు



జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య

ట్రాఫిక్ ఉల్లంఘనులకు లైసెన్సులు రద్దు




● సీఎం సిద్దరామయ్య హెచ్చరిక

● 'సీఎం అంబులెన్స్ సర్వీసెస్' పేరుతో 65 అత్యాధునిక వాహనాలు ప్రారంభం

● రోగిని సకాలంలో ఆస్పత్రిలో చేర్చడమే ధ్యేయం..

బెంగళూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేస్తామని సీఎం సిద్దరామయ్య హెచ్చరించారు. విధానసౌధ ప్రాంగణంలో సోమవారం 65 అత్యాధునిక అంబులెన్స్‌లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు అధ్యక్షత వహించారు. నూతన అంబులెన్స్‌లకు 'సీఎం ఎమర్జెన్సీ సర్వీసెస్‌గా' పేరు పెట్టారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రమాదం జరిగినప్పుడు గోల్డెన్ అవర్ కీలకమన్నారు. ప్రతి రోగికి సకాలంలో ఆసుపత్రికి చేర్చితే ప్రాణాలు కాపాడినట్టే అన్నారు. అంబులెన్స్‌లకు దారి ఇచ్చే విధానం ప్రతి వ్యక్తి బాధ్యతగా భావించాలన్నారు. మొబైల్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపే విధానం సరికాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించేవారిపట్ల నిర్లక్ష్యానికి తావులేదన్నారు. మంత్రి రామలింగారెడ్డి, హెచ్‌ఎం రేవణ్ణతోపాటు పలువురు పాల్గొన్నారు.

సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన క్రాంతివీర సంగొళ్ళిరాయణ్ణ అభివృద్ధి ప్రాధికార నాల్గో సభ జరిగింది. మంత్రి శివరాజ్ తంగడగి, కనకదాస అధ్యయనపీఠ చైర్మన్ కాతా చిక్కణ్ణ, ఎమ్మెల్యేలు మహంతేశ్ కౌజలగి, శివణ్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ బెళగావి జిల్లా భైలహొంగల తాలూకా సంగొళ్ళి గ్రామంలో రాయణ్ణ సైనిక్‌స్కూల్ పనులకు రూ.179.30 కోట్లకు కేబినెట్ ఆమోదించిందన్నారు. అదనంగా 30 కోట్లు కేటాయించేందుకు జిల్లా అధికారికి సూచించామన్నారు. రాష్ట్రంలో విద్యార్థులకు అనుకూలం కావాలనే ప్రాథమిక తరగతులలో వర్టికల్ పాఠశాలను ప్రారంభించదలిచామన్నారు. సైనిక్ స్కూల్‌లో రెగ్యులర్ టీచర్లను నియమిస్తామన్నారు. ఖానాపుర తాలూకా నందఘడ గ్రామంలో రూ.75.29 కోట్లతో రాయణ్ణ మ్యూజియం పనులు పూర్తి చేయదలిచామన్నారు. మంత్రి భైరతి సురేశ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. సాయంత్రం సీఎం అధ్యక్షతన కాగినెలె ప్రాధికార సమితి సభలో మంత్రి భైరతి సురేశ్, హెచ్‌ఎం రేవణ్ణ, ఎమ్మెల్యే బసవరాజ్ శివణ్ణ, తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,620.06
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	10,564	3,776
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,144	9,872
సామర్థ్యం (టీఎంసీలు)	101.77	61.49

మరమ్మతులతో వాహనదారులకు ఇబ్బందులు

● ఆరునెలలైనా కొలిక్కిరాని రహదారి పనులు ● 450మీటర్ల రోడ్డుకు ముగ్గురు కాంట్రాక్టర్లు



నారాయణరావ్ పార్కువద్ద మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 23: నగరంలో పలు చోట్ల రహదారుల మరమ్మతులు వాహన దారులకు చుక్కలు చూపిస్తున్నాయి. స్థానిక రాయల్ సర్కిల్ నుండి సంగం సర్కిల్ వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు నత్తనడక నడుస్తున్నాయి. ప్రజా పనుల శాఖ ఆధ్వర్యంలో రాయల్ సర్కిల్‌లో టవర్ క్లాక్ నిర్మాణంతో పాటు ఎదురుగా ఉన్న అనంతపురం రోడ్డు వెడల్పు పనులు ప్రారంభమై దాదాపు ఆరునెలలు కావస్తున్నా... ఇంతవరకు ఇవి కొలిక్కి రాలేదు. రాయల్ సర్కిల్ నుంచి సంగం సర్కిల్ వరకు గల 450మీటర్ల రోడ్డుకు ముగ్గురు కాంట్రాక్టర్లు మారడం, వారి మధ్య సమన్వయ లోపం కారణంగా పనులు మరింత ఆలస్యమవుతున్నాయి. గతంలో ఆగస్టు 15నాటికి రోడ్డు పనులు, టవర్‌క్లాక్ నిర్మాణం పనులు పూర్తి అవుతాయినా అందరూ భావించినా... పనులు ఆలస్యం కావడంతో ప్రారంభం నవంబరు 1, రాష్ట్ర అవతరణ దినోత్సవానికి పూర్తిచేయనున్నట్లు అధికారుల పేర్కొంటు న్నారు. అయితే ప్రస్తుతం సంగం సర్కిల్ నుంచి నారాయణరావ్ పార్కు వరకు ఉన్న భారీ ప్రమాణంలో తాగునీటి పైప్‌లైన్ అడ్డు రావడంతో పనులు ఆగిపోయాయి. పనుల ప్రారంభంలోనే ఈ పైప్‌లైన్ స్థలాంతరం చేసి ఉంటే ఇప్పటికే పనులు పూర్తి అయ్యేవని అధికారులు భావిస్తున్నారు. అయితే పైప్‌లైన్ నిర్మాణం పనులు కార్పొరేషన్ పరిధిలో ఉండడం, మధ్యలో ఆపితే నగరంలో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పైప్‌లైన్ తొలగించేందుకు అనుమతి కోసం ఇన్ని రోజులు ఎదురు చూసినట్లు తెలుస్తోంది. పనులు ముగించే కాలావధి దగ్గరపడడంతో చేసేది లేక సోమవారం తాగునీటి పైప్‌లైన్ స్థలాంతరం చేసే పనులు ప్రారంభించారు. పైప్‌లైన్ మార్పిడి ఒకటైతే పైప్‌లైన్ జోడింపు క్లిష్టతరంగా ఉండడంతో ఒకటికి రెండు సార్లు పైప్‌లైన్ పరిశీలన తరువాత పనులు పూర్తి అయినట్లు కార్పొరేషన్ అధికారులు నిర్ధారించాల్సి ఉంటుంది. పైపులైన్ పనులు ముగియడానికి మరో ఒకటి రెండు రోజులు పట్టవచ్చని కార్పొరేషన్ అధికారులు భావిస్తున్నారు.

ఎంపీ కార్యాలయం తెరుచుకునేదెప్పుడో..!



తాళం వేసిన ఎంపీ కార్యాలయం

బళ్లారి సిటీ, సెప్టెంబరు 23: నియోజకవర్గ ఎంపీ తుకారం ఇప్పటి వరకు జిల్లాకేంద్రంలో కార్యాలయం ప్రారంభించలేదు. దీంతో నియోజకవర్గ ప్రజలు ఫిర్యాదులను ఎవరికి చెప్పుకోవాలో తెలియక అయోమయంగా ఉన్నారు. ప్రజల సౌకర్యార్థం జిల్లా యంత్రాంగం ఆయా జిల్లాల్లో ఎంపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తుంది. జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఎంపీఎపీలకు గది ఉంది. ఇది ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ఎంపీపీ కార్యాలయం ఎదుట మాజీ ఎంపీ పేరుతో నేమ్‌ప్లేట్ కూడా ఉంది. కనీసం కొత్త ఎంపీగానీ, జిల్లా యంత్రాంగంగానీ మార్చే ప్రయత్నం చేయలేదు. తుకారం ఎంపీ కాకముందు బీజేపీకి చెందిన దేవేంద్రప్ప ఎంపీగా ఉన్నారు. అంతకు ముందు ఉగ్రప్ప కొద్దికాలం ఎంపీగా ఉన్నారు. ఉగ్రప్ప నిత్యం ఆఫీసుకు వచ్చేవారు. దేవేంద్రప్ప ఆఫీసుకు అప్పుడప్పుడూ వచ్చేవారు. తుకారం ఎంపీగా బాధ్యతలు స్వీకరించి మూడు నెలలైనా ఆఫీసుకు వచ్చిన దాఖలాలు లేవని విమర్శలు వినిపిస్తున్నాయి.

పౌరకార్మికుల సేవలు అద్వితీయం: మేయర్

బళ్లారి సిటీ,సెప్టెంబరు 23: పౌరకార్మికుల సేవలు అద్వితీయమని, వారు నిజమైన కష్టజీవులని బళ్లారి మహానగర కార్పొరేషన్ మేయర్ ముల్లంగి నందీష్ కొనియాడారు. సోమవారం నగరంలోని కమ్మ భవన్‌లో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పౌర కార్మికుల దినోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నగర పరిశుభ్రతను కాపాడాల్సిన బాధ్యత సివిల్ సర్వెంట్లపై ఉందన్నారు. గాలి, వాన, ఎండ, చలి తేడా లేకుండా తెల్లవారు జాము నుంచే స్వచ్ఛత పనులు చేపడ్తారన్నరు. పౌర సిబ్బంది తమ పని పట్ల ఉదాసీనత చూపకుండా, మన స్ఫూర్తిగా, శ్రద్ధగా పని చేయాలన్నారు. బళ్లారి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 334 మంది పర్మినెంట్ సివిల్ సర్వెంట్లు ఉన్నారు. అదేవిధంగా 190 మంది పౌర కార్మికులు ప్రత్యక్ష కాంట్రాక్టు కింద పనిచేస్తున్నారు. 150 మంది ఔట్‌సోర్సింగ్, 90 మంది అంతర్గత డ్రైన్‌లను శుభ్రపరిచే పనిలో నిమగ్నమై ఉన్నారన్నారు. కార్పొరేషన్ పరిధిలోకి వచ్చే పౌరకార్మికుల పిల్లలకు కార్పొరేషన్ ప్రత్యేక గ్రాంట్ కింద స్కాలర్‌షిప్‌లు, ఉచిత ల్యాప్‌టాప్‌లు అందజేస్తా మన్నారు. ప్రతి మూడు నెలలకోసారి ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకుని పౌరసత్వకార్మికులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మేయర్ సూచించారు.



మాట్లాడుతున్న మేయర్ నందీష్, ఏడీసీ మహ్మద్‌జుబేర

జిల్లా అదనపు కలెక్టర్ మహ్మద్ జుబేర్ మాట్లాడుతూ ఏ పోస్టుకు ఉన్నత, తక్కువ అనే తేడా లేదని అన్నారు. ప్రతి సంవత్సరం పౌర కార్మికులను సన్మానించడం హర్షణీయమన్నారు. ప్రతిరోజు పని ఒత్తిడిలో ఉన్న కార్మికులకు క్రీడాపోటీలు నిర్వహిస్తే మరింత ఉత్సాహం వస్తుందని సిటిజన్ వర్కర్స్ డేలో భాగంగా బళ్లారి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కార్మికులకు క్రీడాపోటీలు నిర్వహించారు. క్రీడా కార్యక్రమంలో భాగంగా క్రికెట్, త్రోబాల్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. విజేతల జట్లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సుకుమ్, వివిధ స్టాండింగ్ కమిటీల సభ్యులు సురేఖ మల్లనగౌడ, ఎర్రమ్మ, సూరి, పద్మరోజ, ఇతర కార్పొరేషన్ సభ్యులు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి

● జిల్లా కమిటీ సభ్యుడు కందకూరు రాముడు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 23: ఆసుపత్రుల్లో పరిశుభ్రత పాటించే సఫాయి కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించడంతోపాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సఫాయి కార్మికుల జిల్లా కమిటీ సభ్యుడు కందకూరు రాముడు కోరారు. సోమవారం జిల్లా ఆరోగ్య కుటంబ సంక్షేమ అధికారుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సఫాయి కార్మికుల ఫిర్యాదుల పరిష్కార సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి శాఖ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు మౌలిక వసతుల కల్పనతో సఫాయి కార్మికుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ముఖ్యంగా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో వార్డులు, డెలివరీ రూం పేషెంట్లు బ్యాండేజింగ్ సహా ముఖ్యమైన క్లీనింగ్ పనులు జరుగుతున్నాయని, వారి జీతాలు, ఇతర అలవెన్సులు సకాలంలో అందజేయాలని,సకాలంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి రమేశ్‌బాబు మాట్లాడుతూ జిల్లాలోని ఐదు తాలూకాల్లో మొత్తం 272డీ గ్రూప్ అటెండర్ పోస్టులు మంజూరయ్యాయని, ఇందులో 120 మంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. 35మంది నాన్‌క్లీనికల్ వ్యక్తులు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్నారని, పర్మినెంట్ ఉద్యోగులకు కేసీఆర్‌సీ నిబంధనల మేరకు వేతనంతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు సమావేశంలో తెలిపారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది శివప్ప, జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్‌అబ్దుల్లా, జిల్లాకుటుంబ సంక్షేమ కార్యక్రమ సమన్వయ కర్త డాక్టర్ పూర్ణిమా కట్టిమణి,జిల్లాఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్ దాసప్పనవర్, బసవరాజు, షాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

పీఎల్‌డీ బ్యాంకుకు అవార్డు



అవార్డు అందజేస్తున్న రాష్ట్ర బ్యాంకుల అధ్యక్షుడు షడక్షరయ్య

కంప్లి, సెప్టెంబరు 23: విజయనగర జిల్లాలోని హోస్పేట పీఎల్‌డీ బ్యాంకు రికవరీలో రాష్ట్రంలో రెండవ స్థానం సాధించింది. బెంగళూరులో రాష్ట్ర బ్యాంకు వార్షిక మహాసభలో కిత్తూరు ఎమ్మెల్యే, రాష్ట్ర బ్యాంకుల అధ్యక్షుడు షడక్షరీ చేతుల మీదుగా హోస్పేట పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు అమాజీ హేమన్నకు అవార్డును అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. రికవరీలో రెండవ స్థానం వచ్చేందుకు సహకరించిన సిబ్బంది, ఖాతాదారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పాముకాటుతో బాలుడి మృతి



శ్రీకాంత్ (ఫైల్)

రాయచూరు సెప్టెంబర్ 23: తాలూకాలోని రఘునాథ హళ్ళిలో ఆదివారం రాత్రి బాలుడు పాముకాటుకు గురైయ్యాడు. నాల్గవ తరగతి చదువుతున్న విద్యార్థి శ్రీకాంత్(10)కు చీకట్లో పాముకాటు వేయగా కొద్ది సేపటికే మృత్యువాతపడ్డాడు. బాలుడి మృతితో కుటుంబం మొత్తం విషాదంలో మునిగిపోగా గ్రామస్థులు పంచాయతీ అధికారుల తీరుపట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొన్ని నెలలుగా తమ గ్రామంలో వీధిదీపాలు వెలగగా చీకట్లోనే మగ్గుతున్నామని వారు ఆరోపించారు. రఘునాథ హళ్ళి, జాగీర్‌వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉండగా సంబంధిత అధికారులకు తాము సమస్యను విన్నవించినా పట్టించుకోలేదన్నారు. చీకటిగా ఉండడం వల్లే బాలుడు చీకట్లో వస్తు పామును గమనించలేదని దీంతో పాముకాటుకు గురైయ్యాడని ఆరోపించారు. ఇందుకు పంచాయతీ అధికారులే బాధ్యత వహించాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని గ్రామంలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని వారు. కోరారు.

కొనసాగుతున్న కార్మికుల నిరసన



నిరసనలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర మోర్చా నాయకుడు దివాకర్

కంప్లి, సెప్టెంబరు 23 : కుడితిని సమీపంలోని బళ్లారి థర్మల్ పవర్ స్టేషన్ కాంట్రాక్ట్ కార్మికుల నిరసనలు సోమవారం ఎనిమిదవ రోజుకు చేరుకున్నాయి. బళ్లారి నుంచి సండూరుకు వెళ్తున్న బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రముఖులు కేఎస్ దివాకర్ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనకు మద్దతు పలికారు. బళ్లారి థర్మల్ పవర్ స్టేషన్‌లో కాంట్రాక్ట్ కింద పనిచేస్తున్న కూలీలకు ప్రభుత్వం కనీస వేతనాలు చెల్లించాలని ఆయన కోరారు. అనంతరం బీటీపీఎస్ కార్మికుల సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి మాట్లాడుతూ ఈఎస్ఐ ఆస్పత్రి కార్మికులకు అనుగుణంగా బళ్లారిలో ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే కార్మికులకు జరుగుతున్న అన్యాయం విషయంపై రాష్ట్ర మంత్రులకు, ముఖ్యమంత్రికి లేఖ రూపంలో తెలియజేశామన్నారు. న్యాయం చేకూర్చేవరకు తమ పోరాటం ఆపేది లేదన్నారు. గురుమూర్తి, రక్షణ వేదిక అధ్యక్షుడు సంపత్ కుమార్ దేవేంద్రప్ప, రమేష్, హరీష్ ఆచారి, జయరామ్, కరిబసప్ప, గోపాల్, మల్లికార్జున, మల్లమ్మ, రుద్రమ్మ, తిప్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులతోనే సహకార సంఘాల అభివృద్ధి



బైలూరు ప్రాథమిక సహకార సంఘం వార్షిక సభలో మాట్లాడుతున్న కార్యదర్శి మద్దేశ్వరరావు

కంప్లి, సెప్టెంబరు 23: సహకార సంఘాలు రైతులు, ఖాతాదారుల వల్లే పూర్తిగా అభివృద్ధి చెందుతాయని బైలూరు కృషి పత్తిన సహకార సంఘం అధ్యక్షుడు శరణప్ప అభిప్రాయపడ్డారు. సోమవారం కురుగోడు పరిధిలోని బైలూరు ప్రాథమిక కృషిపత్తిన సహకార సంఘం 2023-24 వార్షిక మహాసభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కార్యదర్శి మద్దేశ్వరరావు సహకార సంఘం లావాదేవీలను చదివి వినిపించారు. సహకార సంఘంలో 3747 మంది సభ్యులున్నారు. అందులో రూ. 2.37 కోట్లు లావాదేవీలు జరిగాయని, రుణాలు పంపిణీ చేశామన్నారు. 2,650 మంది రైతులకు ఆరోగ్య యశస్విని కార్డు పంపిణీ కార్డు పంపిణీ చేశామని, సహకార సంఘం సభ్యులతో పాటు గ్రామ ప్రజలు కూడా ముందుకొచ్చినప్పుడే పూర్తిగా అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నవీన స్వామి, వెంకటేశ్వరరెడ్డి, ఐయ్యన్న, గణేశప్ప, హరిజన మరిడమ్మ, లత, జానకి, పక్కీరప్ప, గిరిమూర్తి, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పోలీస్ స్టేషన్లుగా టెక్కలకోట, అచ్చొళ్లి

సిరుగుప్ప, సెప్టెంబరు 23 : ఉత్తమ పోలీస్ స్టేషన్లుగా టెక్కలకోట, అచ్చొళ్లి పోలీస్ స్టేషన్లు ఎంపికయ్యాయి. మంగళవారం కేంద్ర హోం శాఖ లెక్క అధికారి సయ్యద్ మహమ్మద్ హుస్సేన్‌సాబ్ టెక్కలకోట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. గతంలో కన్నా స్టేషన్ పరిధిలో నేరశాతం తగ్గడంతో తాలుకాలోని టెక్కలకోట, అచ్చొళ్లి పోలీస్ స్టేషన్లు బెస్ట్ పోలీస్ స్టేషన్లుగా ఎంపికైనట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేష్, సీఐ సుందరేష్, టెక్కలకోట ఎస్ఐ శ్రీనివాస, శిరిగేరి ఎస్ఐ సద్దామ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం రైతుల ఆందోళన

రాయచూరు సెప్టెంబర్ 23 : తుంగభద్ర ప్రధాన కాలువ పరిధిలోని ఉప కాలువలకు నీరందడం లేదంటు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను అధికారుల దృష్టికి తెచ్చినా స్పందించకపోవడంతో ఆగ్రహించిన వారు సోమవారం జిల్లాలోని సిరవార పట్టణంలో రాస్తారోకో చేపట్టారు. లింగసుగూరు-సిరవార ప్రధాన రహదారిలో రైతులు ఆందోళన చేపట్టడంతో దాదాపు గంటకు పైగా వాహన సంచారం నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన రైతులు తుంగభద్ర జలాశయంలో పూర్తిస్థాయి నీరున్నా ప్రధాన కాలువకు నీరు వదులుతున్న అధికారులు 89, 90, 91, 92, 94 కాలువలకు నిర్దేశిత గేజ్ మేరకు నీటిని విడుదల చేయకపోవడంతో చివరి ఆయకట్టు నిర్వీర్యంగా మారిందన్నారు. ఇప్పటికే లక్షలు అప్పు చేసి పంటలు సాగు చేయగా నీరందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చివరి ఆయకట్టుకు తగినంత నీటిని విడుదల చేయకపోతే ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.



దెబ్బతిన్న పంటను చూపుతూ ఆందోళనలో పాల్గొన్న రైతులు

డిగ్రీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 23: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ, బీపీఈడీ పరీక్షల ఫలితాలను ఇన్‌చార్జ్ వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు సోమవారం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. ఏప్రిల్‌లో డిగ్రీ బీఏ, బీబీఏ, బీసీఏ, బీకామ్, బీఎస్సీ నాలుగో సెమిస్టర్ పరీక్షలను నిర్వహించామన్నారు. 6831 మంది పరీక్షలు రాయగా 3746మంది పాస్ అయ్యారని తెలిపారు. దీంతో ఉత్తీర్ణత శాతం 54.83గా నమోదైనట్లు పేర్కొన్నారు. జూలైలో నిర్వహించిన బీపీఈడీ ప్రథమ సెమిస్టర్‌లో 53, తృతీయ సెమిస్టర్‌లో 22మంది విద్యార్థులు పాస్ అయ్యారని తెలిపారు. విద్యార్థులు వారి ఫలితాలకోసం జ్ఞానభూమి పోర్టల్‌ను సందర్శించాలని సూచించారు. ఫెయిల్ అయిన విద్యార్థులు రీవాల్యుయేషన్, ఫిజికల్ వెరిఫికేషన్ కోసం అక్టోబరు 10లోపు ఒక్కో పేపర్‌కు రూ.500 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినార్ డాక్టర్ లోకేష్, ఏఆర్ శంకర్, సూపరింటెండెంట్ మారుతీ, సీనియర్ అసిస్టెంట్ సాయిశివ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు వీడాలి

● కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్

రాయచూరు సెప్టెంబర్ 23: కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తు కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన నాల్గు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు కార్మిక లోకానికి శాపంగా మారాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా సోమవారం జిల్లాధికారి కార్యాలయం ఎదుట పలు కార్మిక సంఘాల నాయకులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, ఏళ్ల తరబడి కార్మిక సంఘాలు, నాయకులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కొత్తగా బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను రూపొందించడం దుర్మార్గమన్నారు. ఈ నిర్ణయం వల్ల కార్మికులు శ్రమదోపిడికి గురవుతుండగా సంపద సృష్టిచే కార్మికులు భికారులుగా మారే దుస్థితి తలెత్తిందన్నారు. కొత్త లేబర్ కోడ్‌ల వల్ల విదేశి, స్వదేశి పెట్టుబడిదారులకు మాత్రమే అనుకూలం కాగా కార్మికులకు పనిభారం పెరగనుందని పైగా పెట్టుబడిదారుల చేతుల్లో కార్మికులు బానిసులుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం నాల్గు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని జిల్లాధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.



డీసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

హోసూరు జోన్

కురుంజినగర్‌లో డీఎంకే సభ



మాట్లాడుతున్న పార్టీ ముఖ్య నేత భాస్కర్

హోసూరు, సెప్టెంబరు 23: హోసూరు 42వవార్డు కురుంజినగర్‌లోని మకళ్ మారియమ్మ ఆలయం వద్ద డీఎంకే సమావేశం జరిగింది. 42వ వార్డు భాస్కర్ అధ్యక్షత వహించారు. వార్డు సభ ప్రతినిధి కణ్ణన్ స్వాగతం పలికారు. హోసూరు సౌత్ రీజియన్ సెక్రటరీ తిమ్మరాజ్, మాజీ సిటీ కౌన్సిల్ చైర్మెన్, మాజీ నగర కార్యదర్శి గురుస్వామి, జిల్లా ప్రతినిధి శ్రీనివాసులు, కృష్ణగిరి పశ్చిమ జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ టీమ్ డిప్యూటీ ఆర్గనైజర్, సౌత్ రీజియన్ ప్రతినిధి, 42 వ వార్డు సభ ప్రతినిధి మంజునాథ్, కౌన్సిల్ అధ్యక్షుడు రామచంద్రన్, హోసూరు సిటీ 35వ వార్డు కౌన్సిలర్, ఏరియా డిప్యూటీ సెక్రటరీ మాదేవ్, ఉప కార్యదర్శి శంకరనారాయణలు ప్రత్యేక ప్రసంగించారు. వార్డు వాసులు పాల్గొని ప్రాంత సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. భవిష్యత్తు కార్యాచరణపై అభిప్రాయలు వెల్లడించారు.

గ్రీవెన్స్ డేలో 335 వినతులు

హోసూరు(కృష్ణగిరి) సెప్టెంబరు 23: కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటైన పీపుల్స్ గ్రీవెన్స్ డేలో ప్రజలనుంచి 335 వినతులు అందాయి. సమావేశానికి కలెక్టర్ కెఎం సరయు అధ్యక్షత వహించారు. ఇళ్ల పట్టాలు, ఉచిత కుట్టుమిన్, వృద్ధాప్య భృతి, మహిళా హక్కుల భృతి, రోడ్డు సౌకర్యం, విద్యుత్ కనెక్షన్ వంటి సమస్యలపై ప్రజలు వినతులు అందించినట్లు కలెక్టర్ తెలిపారు. అర్హత కల్గిన పిటీషన్‌లను గడువులోగా పరిష్కరించాలని సాధ్యం కాని వాటికి అర్జీదారుడికి తెలపాలని సూచించారు. కళా సాంస్కృతిక శాఖ తరఫున కృష్ణగిరి జిల్లా జానపద కళాకారులు ముగ్గురికి రూ.75 వేలు, ఇక విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇతరత్రా లబ్ధిదారులకు చెక్కులు అందచేశారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ పన్నీర్‌సెల్వం, జిల్లా ఆది ద్రావిడర్ సంక్షేమ అధికారి రమేశ్‌కుమార్, జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ అధికారిణి పద్మలత, జిల్లా కలెక్టర్ ఇంటర్వ్యూ, అసిస్టెంట్ సుందరరాజ్, జానపద కళాకారుల సంక్షేమ సంఘం సభ్యులు ఆధవన్ దిత్సవ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ కేఎం సరయు

ప్రమాదాల నియంత్రణపై అవగాహన

హోసూరు, సెప్టెంబరు 23: హోసూరులో వర్షాకాలం, దీపావళి పండుగ సందర్భంగా ముందు జాగ్రత్త చర్యలపై అగ్నిమాపక శాఖ ద్వారా మాక్‌డ్రిల్ నిర్వహించింది. విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో వానాకాలంలో చోటు చేసుకునే వరదలు, దీపావళి వేళ అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణా కార్యక్రమంల్లో వర్షాకాలంల్లో వచ్చే వరదలు వంటి విపత్తులను ఎలా నివారించాలో ఎలా కోలుకోవాలో ప్రదర్శించారు. అలాగే దీపావళి పండుగ సమీపిస్తున్నందున చాలా క్రాకర్స్ షాపులు ప్రారంభించబడ్డాయి. ఈ నేపథ్యంల్లో అనుకోని అగ్ని ప్రమాదాల్లో చోటు చేసుకునేవారిని రక్షించడంపై ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ, అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొని లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రజలకు వివరించారు.



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

డాక్టర్ ఎడ్వర్డ్ బచ్ (జయంతి)




బ్రిటీష్ డాక్టర్ ఎడ్వర్డ్ బచ్ 1886 సెప్టెంబరు 24న బర్మింగ్‌హామ్‌లోని మోస్లే ప్రాంతంలో జన్మించారు. బ్యాక్టీరియాలజిస్ట్‌గా, హోమియోపతిస్ట్‌గా, ఆధ్యాత్మిక రచయితగా రాణించారు. ఆయన రూపొందించిన 'బచ్ ఫ్లవర్ రెమెడీస్' వైద్యవిధానం కాస్త భిన్నంగా ఉండి ఆకట్టుకుంది. రోగాల నివారణకు సరికొత్త విధానం అవలంబించారు. 50వ యేట 1936 నవంబరు 27న కన్నుమూశారు.

రుహోల్లా ఖొమైనీ (జయంతి)



ఇరాన్ దేశానికి చెందిన రాజకీయ నాయకుడు, పండితుడు రుహోల్లా ఖొమైనీ 1902 సెప్టెంబరు 24న జన్మించారు. 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్' సంస్థాపకులు, ఉద్యమనేత. విప్లవం తర్వాత దేశానికి అధినేత అయ్యాడు. ఈ పదవి ఆజన్మాంతము దేశంలో అత్యున్నత, మత రాజకీయ నాయకుడిగా కొనసాగే అవకాశం కల్పించబడింది. హజ్జతుల్ ఇస్లాం లేదా హజ్జతుల్లా అని సంబోధిస్తారు. ఫిలాసఫీ, కవిత్వం, సాహిత్యం, రాజకీయాలు - ప్రభుత్వంపై పుస్తకాలు రాశారు. 1989 జూన్ 3న కన్నుమూశారు. అంత్యక్రియలలో 30 లక్షల మందికిపైగా పాల్గొన్నారు.

స్వామి చిదానంద (జయంతి)



ప్రముఖ ఆధ్యాత్మికవేత్త స్వామి చిదానంద 1916 సెప్టెంబరు 24న మంగళూరులో జన్మించారు. ఆయన అసలు పేరు శ్రీధర్‌రావు. సన్యాసం స్వీకరించాక 'చిదానంద'గా నామకరణం చేశారు. రిషికేశ్‌లోని 'డివైన్ లైఫ్ ఆఫ్ సొసైటీ'కి అధ్యక్షుడిగా వ్యవహరించారు. దేశ విదేశాలలో ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. యోగాపై దేశవ్యాప్తంగా అవగాహన కల్పించి ఒక మ్యూజియం కూడా ఏర్పాటు చేశారు. 2008 ఆగస్టు 28న పరమపదించారు. 2016లో ఆయన శతజయంతి స్మారక పోస్టల్‌స్టాంపు విడుదల చేశారు.

ధూళిపాళ సీతారామశాస్త్రి (జయంతి)



తెలుగు నాటక, సినీరంగంలో పేరొందిన ధూళిపాళ సీతారామశాస్త్రి 1922 సెప్టెంబరు 24న గుంటూరు జిల్లా పల్నాడు మండలం దాచేపల్లిలో జన్మించారు. పౌరాణిక పాత్రలలో ప్రత్యేకించి 'శకుని' పాత్ర ఆయన జీవితంలో మైలురాయి అని చెప్పాలి. గయుడు, రావణుడు, మైరావణుడు వంటి పౌరాణిక పాత్రల్లో మెప్పించారు. 13వ ఏటనే నటనా రంగంలోకి ప్రవేశించి రంగస్థలంపై దుర్యోధన, కీచకుడు తదితర పాత్రల్లో రాణించారు. 300కుపైగా సినిమాలలో సాత్విక, దుష్ట పాత్రల్లో నటించి ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. జీవిత చరమాంకంలో శ్రీరామసేవకే అంకితమయ్యారు. ధూళిపాళ ట్రస్టు ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి, ధూళిపాళ కళావాహిని ద్వారా కళారంగాన్ని ప్రోత్సహించారు. 2001లో కంచి కామకోటి పీఠాధిపతి నేతృత్వంలో సన్యాసం స్వీకరించి మారుతి సేవేంద్ర సరస్వతిగా మారారు. 2007 ఏప్రిల్ 13న కన్నుమూశారు.

ఎలియనర్ కాటన్ (పుట్టినరోజు)



నవలా రచయిత్రి, స్క్రీన్‌రైటర్ ఎలియనర్ కాటన్ 1985 సెప్టెంబరు 24న ఉత్తర అమెరికా కెనడా దేశంలో జన్మించారు. అతి పిన్న వయస్సులోనే 'ది ల్యూమినరీస్' నవలకు 'బుకర్ ప్రైజ్' అందుకున్నారు. కెనడియన్ గవర్నర్ జనరల్స్ లిటరరీ అవార్డ్, సాహిత్యంలో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఆమె తొలి నవల 'రిహార్సల్' సినిమాగా తెరపైకెక్కి, 2016 టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో ప్రదర్శించబడింది. న్యూజిలాండ్ పోస్ట్‌బుక్ అవార్డ్, ఇతర గౌరవాలు అందుకున్నారు. 2023లో బెస్ట్ ఆఫ్ యంగ్ బ్రిటీష్ నావలిస్ట్‌గా 'గ్రాంటా'లో చోటు పొందారు.

సకాలంలో రుణాలు చెల్లించి వడ్డీరాయితీ పొందండి

» పీఎల్‌డీ బ్యాంకు సర్వసభ్య వార్షిక సమావేశం

బాగేపల్లి, సెప్టెంబరు 23: గడువులోగా రుణాలు తిరిగి చెల్లిస్తేనే వడ్డీ మాఫీ ఉంటుందని లేకుంటే వడ్డీకూడా చెల్లించాల్సి ఉంటుందని పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు వి ప్రభాకరరెడ్డి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని తాలూకా ప్రాథమిక సహకార కృషి, గ్రామీణాభివృద్ధి బ్యాంకు ఆవరణలో 84వ సర్వసభ్య వార్షిక సమావేశాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బ్యాంకులనుంచి రుణాలు పొందిన రైతులు తిరిగి చెల్లించడంలోనూ అంతే ఆసక్తి చూపాలన్నారు. కంతు తేదీలోగా రుణాలు చెల్లించడం ద్వారానే వడ్డీ మాఫీ సాధ్యమన్నారు. లేకుంటే వడ్డీకూడా చెల్లించాల్సిందేనన్నారు. కాగా ప్రభుత్వం రుణ మాఫీ చేస్తుందనే ఉద్దేశ్యంతో జాప్యం చేయరాదన్నారు. సభ్యత్వ రుసుం చెల్లించి ఐదేళ్లపాటు బ్యాంకువైపు రాకుండా కేవలం ఎన్నికల వేళమాత్రమే కనిపిస్తే సహకార సంఘాల నియమావళి ఒప్పుకోదన్నారు. ఓటరుజాబితానుంచి సభ్యుడిపేరును అనర్హత చేస్తారన్నారు. బ్యాంకులో ఏడాది పొడవునా జరిగే లావాదేవీలకు సంబంధించి మహాసభలో ఆడిట్ రిపోర్టు రూపంలో సమర్పిస్తారన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. సహకారసంఘాల నియమావళి ప్రకారం ఐదేళ్లలో ఐదుసార్లు జరిగే సమావేశాలకు కనీసం 3 సభలకు హాజరై పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఏడాదికి కనీసం రూ.2వేల నగదు లావాదేవీ లేదా కనీసం రూ.5వేల డిపాజిట్ ఫిక్స్‌డ్ డిపాజిట్ ఉండాలన్నారు. లేనిపక్షంలో ఎన్నికల వేళ పోటీ చేయడం, ఓటు హక్కు వినియోగానికి అర్హత ఉండదన్నారు. సమావేశంలో బ్యాంకు ఉపాధ్యక్షుడు లక్ష్మీదేవమ్మ సుబ్బారెడ్డి, డైరెక్టర్‌లు నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నారాయణరెడ్డి, కేఆర్ ఆంజినప్ప, బైయప్ప, ఆనంద తదితరులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో బ్యాంకు అధ్యక్షుడు, సభ్యులు

గుండె జాగ్రత్తలపై అవగాహనకు త్రీడీ ఆర్ట్ ప్రాజెక్ట్



త్రీడీ ఆర్ట్ ఇలా...

బెంగళూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): బెంగళూరు ట్రాఫిక్ పోలీసులు, బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్‌లతో కలసి మణిపాల్ ఆసుపత్రి ప్రజల్లో హృదయ సంబంధిత జాగ్రత్తలపై అవగాహన కల్పించేలా త్రీడీ ఆర్ట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. ధూమపానం, నాసిరకం ఆహారం, ఇతర వ్యసనాలతో ఆరోగ్యంపై ప్రభావం చూపనున్నాయని మంచి అలవాట్లు పాటించాలని అవగాహన కల్పించనున్నారు. ప్రముఖ చిత్రకారులు బాదల్ నంజుండస్వామి, హరియాణకు చెందిన త్రీడీ ఆర్ట్ స్పెషలిస్ట్ ముఖేశ్‌కుమార్‌లు రూపొందించారు. నగర వ్యాప్తంగా 20 ప్రదేశాలలో ఏర్పాటు చేయదలిచారు. ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, మెట్రో స్టేషన్‌లు, లాల్‌బాగ్, మంత్రిమాల్, టెక్ పార్కులతోపాటు మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌లలో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

పౌరకార్మికుల సేవలు ప్రశంసనీయం



పౌరకార్మికుల ఆత్మీయ సన్మానం

విజయపుర, సెప్టెంబరు 23: ఆరోగ్యాన్ని సైతం లెక్కించకుండా ప్రజలకోసం పట్టణాన్ని స్వచ్ఛంగా ఉంచడంలో నిరంతరం శ్రమిస్తున్న పౌరకార్మికుల సేవలు ప్రశంసనీయమని పురసభ ముఖ్య అధికారి సంతోష్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని పురసభ ఆవరణలో ఏర్పాటైన పౌరకార్మిక దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. పౌరకార్మికుల పట్ల చిన్నచూపు తగదన్నారు. పురసభ సభ్యుడు నందకుమార్ మాట్లాడుతూ డాక్టర్ మాదిరిగా ఆరోగ్యకరమైన పట్టణం కోసం పౌరకార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారని వారిని గౌరవించడం మన కర్తవ్యమన్నారు. పౌరకార్మికులకు కనీస సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. వారికి ప్రతి నెలా సకాలంలో జీతం అందేలా చూడాలన్నారు. స్థాయి సమితి మాజీ అధ్యక్షుడు నారాయణస్వామి, పురసభ సభ్యుడు హనీఫుల్లా తదితరులు ప్రసంగించారు. ఇదే సందర్భంగా సమాజ సేవకులు అంబరీశ్, కెనరాబ్యాంకు, కోటక్ మహీంద్ర బ్యాంకు తరఫున పౌరకార్మికులకు యూనిఫాం, మిక్సీ అందచేశారు. ఉత్తమ సేవలందించి కన్నుమూసిన తాయమ్మ తరఫున ఆమె కుమారుడు శ్రీనివాస్, పురసభ పౌరకార్మిక మేస్త్రీగా నాగరాజ్‌తోపాటు పౌరకార్మికులకు దుప్పట్లు అందజేసిన సంధ్యా అంబరీశ్ దంపతులు, కెనరా బ్యాంకు మేనేజర్ శ్రీధర్‌రెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో పురసభ మాజీ అధ్యక్షులు రాజేశ్వరి భాస్కర్, విమల బసవరాజు, పురసభ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లావాదేవీలతో సహకార సంఘాన్ని ప్రోత్సహించాలి



వార్షిక సర్వసభ్య సమావేశంలో వెంకటాచలపతి తదితరులు

బంగారపేట, సెప్టెంబరు 23: సహకారసంఘం దుకాణాలలోనే రసాయన ఎరువులను షేర్‌హోల్డర్‌లు, రైతులు కొనుగులో చేయడం ద్వారా వినియోగదారులకు లాభదాయకం కానుందని తాలూకా వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ సహకార సంఘం, జనతాబజార్ అధ్యక్షుడు ఏవీ వెంకటాచలపతి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని టీఏపీసీఎంఎస్ పిండి మిషన్ ఆవరణలో 2023-24 వార్షిక సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇతర దుకాణాలతో పోలిస్తే ఇక్కడ రసాయన ఎరువుల కొనుగోళ్లు తక్కువగా ఉన్నాయన్నారు. చాలామంది రైతులు కేవలం యూరియా మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. ఇతర రకాల ఎరువులు కూడా కొనుగోలు చేయడం ద్వారా రైతులకు లాభం కానుంద న్నారు. గత ఏడాది సరాసరి 3-4 కోట్ల ఎరువుల లావాదేవీలు జరిగాయన్నారు.

ఈసారి రూ.1.60 కోట్లకు తగ్గింద న్నారు. సహకార సంఘానికి నేరుగా ఆర్థిక సౌలభ్యం లేద న్నారు. ఎరువులు, ఇ-స్టాంప్, జనౌషధి విక్రయాల ద్వారానే ఆదాయం గడించాల్సి ఉంటుందన్నారు. జనౌషధి విక్రయాల ద్వారా సంఘానికి రూ.15లక్షల లాభం గడిస్తే వినియోగదారులకు సుమారు 4 కోట్ల మేర మిగులు చేకూరనుందన్నారు. ప్రతి ఔషధిపై సుమారు 70-75శాతం రాయితీ ఉంటుందన్నారు. కొంత మంది వైద్యులు జనౌషధి పట్ల ఇష్టమొచ్చిన వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఇతర మందుల కంపెనీలు వైద్యులకు కమీషన్ ఇస్తారని, అయితే తాము ఇచ్చేది లేదన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షురాలు కేపీ భవ్యా, డైరెక్టర్‌లు రామే గౌడ, ఎం చంద్రప్ప, వెంకటేశ్, హెచ్ ఆర్ శ్రీనివాస్, ఆనంద్, కృష్ణేగౌడ, వెంకటేశ్, సతీశ్‌కుమార్, చంద్రప్ప, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

» ఎంపీ తేజస్వి సూర్య

బెంగళూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక, క్రీడల్లో రాణిస్తూనే నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వి సూర్య అభిప్రాయపడ్డారు. ఆర్‌వి ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తేజస్విసూర్య మాట్లాడుతూ చరిత్రను పరిశీలిస్తే మనిషి తన సామర్థ్యాన్ని అత్యుత్తమంగా మలచుకునే అవకాశం విద్యార్థి దశలోనే ఉంటుందన్నారు. యువభారత్ ద్వారా దేశం ప్రగతి సాధించాలంటే ప్రతి విద్యార్థి చదువుతోపాటు నైపుణ్య విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉపకులపతి ద్వారికా ప్రసాద్ ఉనియాల్, హానరబుల్ చాన్స్‌లర్ ఏవీఎస్ మూర్తి, ప్రొ-చాన్స్‌లర్ డిపి నాగరాజ్, డాక్టర్ ఎంపి శ్యామ్, డాక్టర్ నిఖిల్‌మూర్తి, ట్రస్టు సభ్యులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తరగతుల ప్రారంభంలో ఎంపీ తేజస్వి సూర్య తదితరులు

ఎమ్మెల్యేకు మాతృవియోగం

బంగారపేట, సెప్టెంబరు 23: బంగారపేట నియోజక వర్గ ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి తల్లి మునియమ్మ (95) కన్నుమూశారు. సోమవారం మధ్యాహ్నం కుప్పనహళ్ళిలో తుదిశ్వాస వీడారు. మంగళవారం ఉదయం 10 గంటలకు స్వగ్రామం కుప్పనహళ్ళిలో అంత్యక్రియలు జరగనున్నాయి. ఎమ్మెల్యేకు మాతృవియోగంపై పలువురు విచారం వ్యక్తం చేశారు.

ఐసీడీఎస్‌లో పోస్టుల భర్తీకి శ్రీకారం

అనంతపురం విద్య, సెప్టెంబరు 23: మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖలో పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా 11 ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు సోమవారం ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి నోటిఫికేషన్ విడుదల చేశారు. పోస్టుల భర్తీపై ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న 84 అంగన్వాడీ టీచర్, మినీ అంగన్వాడీ టీచర్, హెల్పర్ పోస్టులను భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. అనంతపురం అర్బన్ ప్రాజెక్టులో 8, శింగనమల 6, నార్పల 9, అనంతపురం రూరల్‌లో 10, తాడిపత్రి 14, గుత్తిలో 5, ఉరవకొండ 12, కణేకల్లు 5, కంబదూరు 7, రాయదుర్గంలో 2 పోస్టులు ఖాళీలున్నాయన్నారు. ఈనెల 25 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, అక్టోబరు 1 ఆఖరి గడువని ఆమె స్పష్టం చేశారు.

దరఖాస్తు చేసుకోండి

ఐసీడీఎస్ పరిధిలోని బాల సదనంలో ఖాళీగా ఉన్న ఏడు ఉద్యోగాలను కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైం కింద భర్తీ చేస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టోర్ కీపర్ పోస్టు ఒకటి, హౌస్ కీపర్ పోస్టు ఒకటి, రెండు ఎడ్యుకేటర్ (టీచర్) పోస్టులు, రెండు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కం మ్యూజిక్ టీచర్ పోస్టులు, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కం యోగా టీచర్ పోస్టు ఒకటి ఖాళీగా ఉన్నాయన్నారు. స్టోర్ కీపర్ పోస్టుకు ఎంపికైన వారికి రూ. 18,356 రెమ్యునరేషన్, హౌస్ కీపర్‌కు రూ. 7,944,, ఎడ్యుకేటర్ పోస్టుకు రూ.5000, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కం మ్యూజిక్ టీచర్‌కు రూ.5000, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కం యోగా టీచర్‌కు రూ.10 వేలు రెమ్యునరేషన్ అందజేస్తారన్నారు. దరఖాస్తులు, జీతం, అర్హతలు, ఇతర వివరాలకు జిల్లా అధికారిక వెబ్‌సైట్ http:// ananthapuramu.gov.inలో పొందుపర్చామన్నారు. ఈ నెల 25 నుంచి అక్టోబరు 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో దరఖాసు స్వీకరిస్తామని తెలిపారు.

8 నుంచి డిగ్రీ పరీక్షలు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 23: ఎస్కేయూ ఆధ్వర్యంలో 1994 నుంచి 2014వరకు డిగ్రీ ప్రవేశాలు పొంది ఫెయిలైన విద్యార్థులకు అక్టోబరు 8 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ సోమవారం ప్రకటనలో తెలిపారు. 2014 వరకు వార్షిక పరీక్షలు నిర్వహించేవారన్నారు. తర్వాత ఆరు నెలలకు ఒకసారి సెమిస్టర్ పద్ధతి ప్రవేశపెట్టినట్లు తెలిపారు. వివిధ కారణాల రీత్యా సంవత్సరం వారి పరీక్షల్లో ఫెయిల్ అయిన వారికి మెగా సప్లిమెంటరీ నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. 4వేలమందికిపైగా ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల విద్యార్థులు ఫీజులు చెల్లించారని తెలిపారు. వారందరికీ అక్టోబరు 8నుంచి 30వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బీకామ్ విద్యార్థులకు ఎస్కేయూలో, బీఏ విద్యార్థులకు ఆర్ట్స్ కళాశాలలో, బీఎస్సీ విద్యార్థులకు కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హాల్‌టికెట్లను www.skuniversity.ac.in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

కమ్మవారి క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహకాలు

బెంగళూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కమ్మవారి క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ 31వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిభావిద్యార్థులకు ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. ఆదివారం కమ్మవారి కళ్యాణమంటపంలో జరిగి సమావేశంలో సొసైటీ అధ్యక్షులు ఎంఎస్ సుబ్రమణ్యం నాయుడు అధ్యక్షత వహించారు. 172మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం నాయుడు మాట్లాడుతూ కమ్మవారి సొసైటీ సభ్యుల పిల్లలకు ఏటా ప్రోత్సాహక బహుమతులను ఇచ్చే సంప్రదాయం ఉందన్నారు. బ్యాంకులు ప్రగతి పరంగా అభివృద్ధి చేయడంతోపాటు సాంకేతికతను అనుసంధానం చేస్తున్నామన్నారు. సభ్యులు లావాదేవీలను నిరంతరం కొనసాగించాలని అప్పుడే బ్యాంకు ప్రగతి సాధ్యమన్నారు. పదో తరగతి నుంచి పీజీతోపాటు వృత్తివిద్యాకోర్సుల విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు. ఉపాధ్యక్షుడు విఆర్ కుమార్, డైరెక్టర్‌లు పిఆర్ బాలకృష్ణ, ఎంకే హరిబాబు, పి జనార్ధనరావు, పి రాజ్‌కుమార్, ఎన్ రాజేంద్రనాయుడు, పీసీ హరినాయుడు, బి రాజేంద్రనాయుడు, మాధవనాయుడు, వనితా సతీశ్, అనితా, మనోహర్‌లతోపాటు సీఈఓ దిలీప్‌కుమార్‌లు పాల్గొన్నారు.



ప్రోత్సాహకాలతో విద్యార్థులు

కేశసంపదపై దృష్టి సారించండి

బెంగళూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సమాజంలో స్త్రీ పురుషులు అనే బేధం లేకుండా కేశసంపదపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని డాక్టర్ బాత్రాస్ హెల్త్‌కేర్ ఎండీ డాక్టర్ అక్షయ్‌బాత్రా అభిప్రాయపడ్డారు. నగరంలో హోమియోపతి చికిత్సా కేంద్రాన్ని సోమవారం ఆరంభించారు. డాక్టర్ అక్షయ్ బాత్రా మీడియాతో మాట్లాడుతూ ఉత్తమమైన ఫార్ములేషన్ ద్వారా మూడు నెలల్లో మార్పు రానుందన్నారు. సెల్యులర్ రీజనరేషన్, క్సోజెన్ ఎక్సోసోమ్ థెరపీ పాటిస్తామన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కేశాలపై ప్రభావం చూపుతుందని కావున వాటి సంరక్షణపై ఆసక్తి చూపాలన్నారు. సహజ సిద్ధమైన, అత్యాధునిక విధానాలతో కేశాల రక్షణ కల్పిస్తామన్నారు. డాక్టర్ డేనియల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంలో ఇంజనీర్లది కీలకపాత్ర



కార్యక్రమంలో ప్రముఖులు, విద్యార్థులు

చిక్కబళ్ళాపుర, సెప్టెంబరు 23: సాంకేతిక పరిజ్ఞానాన్ని అత్యున్నతస్థాయికి తీసుకెళ్లడంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని బెంగళూరుకు చెందిన ఎన్ఎస్ఆర్‌సీఎల్ అధినేత గోపాల్‌రావు అద్దంకి అభిప్రాయపడ్డారు. నగర శివారులోని నాగార్జున ఇంజనీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సర ప్రారంభోత్సవ వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్య అంత సులభం కాదని పాఠాలతోపాటు పలు అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తద్వారా వారి నేతృత్వంలో తయారయ్యే ఉత్పత్తులు నాణ్యతగా ఉంటాయన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు పలు సలహా సూచనలు చేశారు. పాఠాలకే పరిమితం కాకుండా అభిరుచి ఉన్న క్రీడలు, సాంస్కృతిక రంగాలలో రాణించాలని సూచించారు. కార్గిల్‌యుద్ధంలో విశేష సేవలందించి పతకం అందుకున్న కేప్టెన్ నవీన్ నాగప్ప ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కార్గిల్‌యుద్ధంలో ఎదుర్కొన్న కష్టాలు, విజయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో నాగార్జున ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌జి గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ రవిశంకర్, వైస్‌ప్రిన్సిపాల్ నగేష్, డీన్ డాక్టర్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు ఫైర్స్‌ద్వారా రెయిన్‌కోట్‌లు

బెంగళూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ట్రేడింగ్, పెట్టుబడుల ప్లాట్‌ఫాం సంస్థ ఫైర్స్ బెంగళూరు ట్రాఫిక్ పోలీసులకు రెయిన్‌కోట్‌లను సమకూర్చింది. బెంగళూరు డీసీపీ సిరిగౌరి, ఫైర్స్ కో-ఫౌండర్ సీఈఓ తేజస్ ఖోడెలు సంయుక్తంగా అందించారు. నగరంలో వర్షాకాలంలో ట్రాఫిక్ పోలీసులు ఇబ్బంది పడకూడదని రెయిన్‌కోట్‌లను సమకూర్చామని తేజస్ వెల్లడించారు. 1400మంది ట్రాఫిక్ పోలీసులకు రెయిన్‌కోట్‌లు అందించినట్టు తెలిపారు.



కార్యక్రమంలో డీసీపీ సిరిగౌరి, సంస్థ ముఖ్యులు

తాలూకాస్థాయి మహిళా చర్చాగోష్టి

శిడ్లఘట్ట, సెప్టెంబరు 23: ధర్మస్థళ గ్రామాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తాలూకా స్థాయి మహిళా చర్చాగోష్టిని పట్టణంలోని వాసవికల్యాణమండపంలో నిర్వహించారు. సంస్థ బెంగళూరు ప్రాంతీయ డైరెక్టర్ శీనప్ప మాట్లాడుతూ స్వసహాయ సంఘాల సిసి ఖాతాలను జాతీయబ్యాంకులలో తెరవడం ద్వారా తక్కువ వడ్డీతో సంఘాల సభ్యులకు రుణాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆర్థిక సౌలభ్యంతోపాటు నిరాశ్రయులకు నెలవారీ పింఛను, జ్ఞానదీప కింద విద్యా చేయూత, సామూహిక ధార్మిక కార్యక్రమాలు, చెరువులలో పూడిక తీత వంటివి కొనసాగిస్తున్నట్టు తెలిపారు. ఆలయాల జీర్ణోద్ధరణకు, పాల డెయిరీల ఏర్పాటుకు, ఇతరత్రా సమాజసేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. మహిళా జ్ఞానవికాస కింద మహిళల స్వావలంబనకు పలు కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగిస్తున్నట్టు తెలిపారు. గ్రామీణ మహిళల్లో చైతన్యం కల్పిస్తున్నామన్నారు. ఆధునిక జీవనశైలి విధానం వల్ల మహిళల్లో గర్భకోశ కేన్సర్ వంటి సమస్యలు తలెత్తుతున్నాయని ఇందుకుగాను మూడేళ్లకోసారి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఉత్తమ ఆహార పద్ధతి, నిర్ణీత వ్యాయామం, ఇతరత్రా మంచి అలవాట్ల ద్వారా కేన్సర్ నుంచి దూరం కావచ్చునన్నారు. ఇదే సందర్భంగా పౌరకార్మికులను ఆత్మీయంగా సత్కరించారు. డాల్ఫిన్ స్కూల్ పాలనాధికారి చందన, అశోక్‌కుమార్, ధర్మస్థళ సంస్థ ప్రశాంత్, సంధ్యాశెట్టి, సురేశ్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.



పౌరకార్మికులకు సన్మానం

మౌలిక సదుపాయాలు కల్పించండి

దొమ్మసంద్ర, సెప్టెంబరు 23: ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళి యమరె గ్రామపంచాయతీ పరిధిలోని చంబేనహళ్ళి గ్రామం నుంచి నెరిగా గ్రామానికి వెళ్లే రోడ్డును బాగు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ అపార్ట్‌మెంట్ వాసులు, స్థానికులు నిరసన తెలిపారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనలో నిర్మించిన రోడ్డు ఏడాదికే గుంతలమయంగా మారిందని గ్రామస్థులు ఆరోపించారు. నిత్యం ఈ మార్గంలో కాంక్రీట్ మిక్సర్ లారీలో అత్యధికంగా సంచరిస్తున్న కారణంగా రోడ్డు త్వరగా దెబ్బతినడంతోపాటు దుమ్ముధూళి విపరీతంగా రేగుతూ ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని వాపోయారు. వందలాది అపార్ట్‌మెంట్‌లు, లేఅవుట్‌ల ద్వారా ఏడాదికి యమరె గ్రామపంచాయతీకి పన్నులు చెల్లిస్తున్నా ప్రభుత్వం మాత్రం కనీస సదుపాయాలు కల్పించడం లేదని స్థానికులు ఆరోపించారు. పంచాయతీకి ఏడాదికి రూ.30కోట్ల ఆదాయం ఉందని నకిలీ బిల్లులతో నిధులు స్వాహా చేస్తున్నారని మాజీ సైనికుడు వేణు ఆరోపించారు. పీడీఓ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. నిరసనలో ప్రవీణ్‌కుమార్, గోపాల్, హేమలతా, అనిల్ చౌదరి, శివరామకృష్ణన్, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన ఇలా...